



# కృత్రిమ రక్తం!

## ఎవరికైనా ఎక్కించే వెసులుబాటు
## షెల్ఫ్‌టైమ్ కూడా 24 రెట్లు ఎక్కువ
## జపాన్ పరిశోధకుల క్లినికల్ ట్రయల్స్
## 2030 నాటి కల్లా అందుబాటులోకి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): రక్తదానం చేయడమంటే ఒకవిధంగా ప్రాణాన్ని పోయడమే. ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తం ఎక్కించడం అత్యవసరం. మన దేశంలో ప్రతీ రెండు సెకండ్లకు ఒకరికి రక్తం అవసరపడుతుంది. అయితే, రక్తదాతలు సమయానికి అందుబాటులో లేకపోవడం, నిల్వ ఉన్న రక్తం పాడైపోవడం, దాతలు అందుబాటులో ఉన్నప్పటికీ బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోవడం, అరుదైన బ్లడ్ గ్రూప్ అవసరపడటం వెరసి సరైన సమయంలో రక్తం అందకపోవడం వల్ల ఏటా మన దేశంలోనే 12 వేల మంది ప్రాణాలు కోల్పోతున్నట్టు అంచనా. ఈ సమస్యలన్నింటికి చెక్ పెట్టే దిశగా జపాన్ పరిశోధకులు ఓ అరుదైన ప్రత్యామ్నాయాన్ని అభివృద్ధి చేశారు. అదే 'ఆర్టిఫిషియల్ బ్లడ్' (కృత్రిమ రక్తం). వైద్య చరిత్రలో దీన్ని ఓ గేమ్‌ఛేంజర్‌గా చెప్తున్నారు.

### ఏమిటీ ఆర్టిఫిషియల్ బ్లడ్?

శరీరంలోని రక్తానికి ప్రత్యామ్నాయంగా ల్యాబ్‌లో అభివృద్ధి చేసిన బ్లడ్‌నే ఆర్టిఫిషియల్ బ్లడ్‌గా పిలుస్తున్నారు. పాడైపోయిన రక్తంలోని హెమోగ్లోబిన్‌ను వేరుచేసి, దాన్ని వైరస్‌ప్రూఫ్ షెల్‌లో ఉంచి కొన్ని ప్రత్యేక పద్ధతుల ద్వారా ఈ ఆర్టిఫిషియల్ బ్లడ్‌ను అభివృద్ధి చేశారు. జపాన్‌లోని నారా మెడికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హిరోమీ సకాయి, ఆమె వైద్యబృందం ఈ ఘనత సాధించారు.

### ఎప్పుడు అందుబాటులోకి..?

క్లినికల్ ట్రయల్స్‌లో ఫలితాలు సానుకూలంగా వస్తే, 2030 నాటికి ఈ ఆర్టిఫిషియల్ బ్లడ్ అందుబాటులోకి రానున్నది. జపాన్‌లోనే కాకుండా అమెరికా, యూకే, చైనా వంటి దేశాలు కూడా ఆర్టిఫిషియల్ బ్లడ్‌పై పలు ప్రయోగాలు నిర్వహిస్తున్నాయి.

### ఎలా ఉపయోగకరం?

ప్రమాదాలు, గాయాలు, సర్జరీలు జరిగినప్పుడు పేషెంట్లకు రక్తం అవసరపడుతుంది. అయితే, దాతలు అందుబాటులో లేకపోయినా, బ్లడ్ గ్రూప్‌లు మ్యాచ్ కాకపోయినా బాధితుల ప్రాణాలను కాపాడటం కష్టంగా మారుతున్నది. దీనికి పరిష్కారంచూపించేందుకే ఈ ఆర్టిఫిషియల్ బ్లడ్‌ను తీసుకొచ్చారు. సాధారణంగా ఎర్ర రక్తకణాలను 7 వారాలకు మించి భద్రపర్చలేం. అయితే, ఈ కృత్రిమ రక్తాన్ని సాధారణ రక్తంతో పోలిస్తే, 24 రెట్లు ఎక్కువకాలం పాటు నిల్వ ఉంచవచ్చని పరిశోధకులు తెలిపారు. అంతేకాదు, బ్లడ్‌గ్రూప్‌తో సంబంధం లేకుండా అందరికీ ఈ రక్తాన్ని ఎక్కించే అవకాశం కూడా ఉందట. దీన్ని శాస్త్రీయంగా రుజువు చేయడానికి ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నారు.

# 11 ఏండ్లు.. 11 వైఫల్యాలు

- ఎన్డీయే పాలనలో సామాన్యుడి బతుకు ఛిద్రం
- ధరలు, నిరుద్యోగం, ఉగ్రదాడులతో కకావికలం
- బ్లాక్‌మనీ వెనక్కి తెస్తామంటూ ఎన్నికల్లో కబుర్లు
- నోట్లరద్దుతో పేద, మధ్యతరగతి జీవనం అస్తవ్యస్తం
- సాగుచట్టాలతో వందలాది మంది రైతన్నల ఉసురు
- జీఎస్టీ, సీఏఏ, ప్రైవేటీకరణతో దేశమంతా ఆగమాగం
- దౌత్య వైఫల్యంతో నిన్నటి మిత్ర దేశాలే నేడు విరోధులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, మే 30 (నమస్తే తెలంగాణ): 'అచ్చేదిన్' తెస్తామంటూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు.. ప్రజలకు సచ్చేదినాలను చూయిస్తున్నది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉగ్రదాడులతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఈ పదకొండేండ్ల పాలనలో ప్రజాసంక్షేమం మాట అటుంచితే.. అనాలోచిత నిర్ణయాలతో ప్రజలను ఎన్డీయే ప్రభుత్వం నిలువునా ముంచింది.

- **ధరాభారం:** ప్రధాని మోదీ 11 ఏండ్లపాలనలో నిత్యావసరాల ధరలు 10 నుంచి 200 శాతం వరకూ పెరిగాయి. బియ్యం, వంట నూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, పాలు, చింతపండుతో పాటు పెట్రోల్, డీజిల్ రేట్లు ఆకాశాన్నంటాయి.
- **నిరుద్యోగం:** ఏటా రెండు కోట్ల చొప్పున ఉద్యోగాల భర్తీ చేపడుతామని అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ.. నిరుద్యోగుల ఆశలపై నీళ్లుచల్లారు. దేశంలో నిరుద్యోగిత రేటు కనీవినీ ఎరుగని స్థాయికి చేరింది. డిగ్రీ పూర్తైన 42 శాతం మందికి ఉద్యోగాలు లేవని ఇటీవల ఓ నివేదిక వెల్లడించింది. మోదీ ఇచ్చిన మాటప్రకారం.. గడిచిన 11 ఏండ్లలో 22 కోట్ల ఉద్యోగ ఖాళీలను నింపాలి. అయితే, 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ మాత్రమే జరిగినట్టు నివేదికలు చెప్తున్నాయి.
- **దేశభద్రత:** గడిచిన పదకొండేండ్ల కాలంలో దేశంలో ఉగ్రదాడి ఘటనలు పెరిగిపోయాయి.2014 నుంచి ఇప్పటివరకూ ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. ఈ దాడుల్లో 103 మంది సైనికులు, 44 మంది పౌరులు మరణించారు. 2016లో జరిగిన ఉరి ఉగ్రదాడి, 2019లో జరిగిన పుల్వామా దాడి, తాజాగా పహల్గాం ఉగ్రదాడితో యావత్తు దేశం వణికిపోయింది.
- **దౌత్యవైఫల్యం:** గడిచిన 11 ఏండ్లలో ప్రధాని మోదీ విదేశాంగ విధానంలో, దౌత్య సంబంధాలను నెరపడంలో విఫలమయ్యారు. భారత్‌కు పొరుగున ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, మాల్దీవులు, భూటాన్ వంటి దేశాలూ మనకు వ్యతిరేకంగా మారి చైనాకు అనుకూలంగా మారడమే ఇందుకు రుజువు. ఇక, పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాక్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టడంలోనూ, అమెరికా ప్రతీకార సుంకాలు, భారతీయ విద్యార్థులపై ఆంక్షలను తప్పించడంలోనూ ఎన్డీయే సర్కారు చేతులెత్తేసింది.
- **బ్లాక్‌మనీ-రైటాఫ్‌లు:** బీజేపీ అధికారంలోకి వస్తే స్విస్ బ్యాంకులో ఉన్న నల్ల ధనాన్ని మొత్తం వెనక్కిరప్పిస్తామని మోదీ 2014 ఎన్నికల ప్రచారంలో ప్రగల్భాలు పలికారు. ప్రతీ ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్నారు. వాస్తవంలో మాత్రం బ్లాక్ మనీ వెనక్కు తీసుకురాకపోగా.. ఎన్డీయే పాలనతో స్విస్ బ్యాంకులో భారతీయుల బ్లాక్ మనీ పెరిగింది. ఆర్థిక నేరగాళ్లు విదేశాలకు పలాయనం చిత్తగించారు. ఎన్డీయే పాలనలో బ్యాంకులు ఇప్పటివరకూ రూ. 16.35 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను రైటాఫ్ చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్రమే ఒప్పుకొన్నది.
- **పెద్ద నోట్లరద్దు-రూపాయి పతనం:** నోట్లను రద్దు చేయడం ద్వారా నకిలీ నోట్లను అరికడతామని, అవినీతి సొమ్ము బయటకు వస్తుందని ఎన్డీయే సర్కారు పెద్ద నోట్ల రద్దు చేసింది. కోట్లాది మంది పేదలను బ్యాంకులు, ఏటీఎంల ముందు లైన్లలో నిలబెట్టింది. వందలాది మంది ఆ లైన్లలోనే ప్రాణాలు కోల్పోయారు. అయినప్పటికీ నోట్ల రద్దు విఫలం అయింది.
- **జీఎస్టీ:** అనేక రకాల పన్నులతో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఒకే దేశం-ఒకే ట్యాక్స్ ఉంటే సులువుగా ఉంటుందని కేంద్రం రాష్ట్రాలను బలవంతంగా ఒప్పించి మరీ జీఎస్టీని తీసుకువచ్చింది. హేతుబద్ధత లేని ట్యాక్స్ స్లాబులతో ఎన్నో వ్యాపారాలు దెబ్బతిన్నాయి.
- **సీఏఏ:** పొరుగుదేశాల్లో మతపరమైన హింసను ఎదుర్కొంటున్నవారికి ఆశ్రయం కల్పిస్తామంటూ ఎన్డీయే సర్కారు పౌరసత్వ చట్టానికి సవరణ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా ఉద్యమం ఎగిసిపడింది.
- **పీఎస్‌యూల ప్రైవేటీకరణ:** లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ ఆస్తులను అమ్మడమే పనిగా కేంద్రం వ్యవహరిస్తున్న తీరు కొంతకాలంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఎల్ఐసీలో కొంత వాటాను ప్రైవేటు పరం చేయడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి.
- **కరోనా లాక్‌డౌన్:** కరోనా నేపథ్యంలో ప్రధాని మోదీ రాత్రికిరాత్రే దేశవ్యాప్త లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేలాది మంది వలస కార్మికులు కాలినడక వేల కిలోమీటర్ల దూరం నడుచుకొంటూ స్వస్థలాలకు వెళ్లారు. మార్గమధ్యలో ఆకలికి తాళలేక, ప్రమాదాల్లో వందలాది మంది చనిపోయారు.
- **సాగుచట్టాలు:** రైతులు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా సాగు చట్టాలను తీసుకువచ్చింది. నిరసనల్లో ఏడు వందల మందికి పైగా రైతులు చనిపోయారు. చివరికి ప్రధాని మోదీ తాపీగా.. రైతులకు సారీ చెప్పి సాగు చట్టాలను వెనక్కు తీసుకొంటున్నట్టు ప్రకటించారు.




# పహల్గాం ఉగ్రవాదులు బీజేపీలో చేరుతారేమో?

- ముష్కరులను ఇంకా ఎందుకు పట్టుకోలేదు?
- సైన్యం క్రెడిట్‌ను కొట్టేసేందుకు ప్రధాని మోదీ యత్నం
- శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ విమర్శలు

న్యూఢిల్లీ, మే 30: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శుక్రవారం తీవ్ర విమర్శలు చేశారు. పహల్గాంలో ఆరుగురు ఉగ్రవాదులు ఇంకా పరారీలో ఉన్నారని, వారు బీజేపీలో చేరుతారేమోనని ఆరోపించారు. 'ఆరుగురు తీవ్రవాదులు అక్కడ ఇంకా పట్టుబడలేదు. బహుశా వారు బీజేపీలో చేరారంటూ ఒకరోజు బీజేపీ కార్యాలయం నుంచి పత్రికా ప్రకటన విడుదల కావొచ్చు' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆపరేషన్ సిందూర్‌ను ప్రధాని మోదీ రాజకీయం చేస్తున్నారని, భారత సైనికులు నిర్వహించిన మిలిటరీ ఆపరేషన్ క్రెడిట్‌ను ఆయన కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఆయన రాష్ట్రం రాష్ట్రం తిరుగుతూ అదంతా తన ఘనతే అని చెప్పకోవడానికి తంటాలు పడుతున్నారన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై చర్చించడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఒక లేఖను అందిస్తాయన్నారు.



# ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ

### ఎన్‌బీఈకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మే 30: జూన్ 15న నిర్వహించాల్సిన నీట్ పీజీ-2025 పరీక్షను రెండు షిఫ్టుల్లో నిర్వహించరాదని, అలా చేస్తే విద్యార్థులకు సమాన అవకాశాలు ఉండవని సుప్రీం కోర్టు జాతీయ పరీక్షల మండలి(ఎన్‌బీఈ)ని ఆదేశించింది. రెండు షిఫ్టులలో పరీక్ష నిర్వహించడం అహేతుకం అవుతుందని, ఏ రెండు ప్రశ్న పత్రాల క్లిష్టత స్థాయి ఎన్నడూ ఒకే రకంగా ఉండదని జస్టిస్‌లు విక్రమ్ నాథ్, సంజయ్ కుమార్, ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని, సురక్షితమైన కేంద్రాలను చూడాలని ఆదేశించింది. ఎన్‌బీఈ తగిన పరీక్షా కేంద్రాలను కనుగొనలేకపోయినా, జూన్ 15న పరీక్ష నిర్వహించలేమనిభావించినా పరీక్ష తేదీని పొడిగించవచ్చునని ధర్మాసనం సూచించింది. కాగా, ఎన్‌బీఈ రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహించడం వల్ల పరీక్ష కష్టస్థాయిలు సమానంగా ఉండవని, విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటూ అదితి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు పింఛన్

### ఆర్థిక శాఖ ప్రకటన

న్యూఢిల్లీ, మే 30: పదేళ్ల కనీస సర్వీసును పూర్తి చేసుకుని 2025 మార్చి 31వ తేదీకి ముందు ఉద్యోగ విరమణ చేసిన కేంద్ర ప్రభుత్వ నేషనల్ పెన్షన్ స్కీమ్(ఎన్‌పీఎస్) సబ్‌స్క్రైబర్లు లేక వారి జీవిత భాగస్వాములు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్(యూపీఎస్) కింద అదనపు ప్రయోజనాలు పొందనున్నారు. ఎన్‌పీఎస్ ప్రయోజనాలు ఇదివరకు పొందినప్పటికీ ఈ ప్రయోజనాలు అదనమని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ పథకం కింద యూపీఎస్‌ని కోరుకున్న రిటైర్డ్ ఉద్యోగులు తాము చివరిసారి తీసుకున్న జీతంలో పదోవంతును పూర్తి చేసుకున్న సర్వీసుకు కరవు భత్యాన్ని కలుపుకుని ఏక మొత్తంగా(ఒకేసారి) రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ని పొందుతారు. రిటైర్డ్ ఉద్యోగులకు సాధారణ వడ్డీతో బకాయిలు చెల్లించనున్నట్లు ప్రకటన తెలిపింది. వీటిని పొందడానికి దరఖాస్తు చేసుకోవడానికి 2025 జూన్ 30ని చివరి తేదీగా పేర్కొన్నది. ఆర్థిక శాఖ జనవరిలో యూపీఎస్‌ని నోటిఫై చేసింది. దీని కింద ఉద్యోగ విరమణకు ముందు చివరి 12 నెలల బేసిక్ పేని సగటున తీసుకుని దానిలో 50 శాతం పింఛనుగా లభిస్తుంది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ పరిధిలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వారు కోరుకుంటే యూపీఎస్ వర్తిస్తుంది.

# రాజ్యసభ సభ్యులకు స్మార్ట్ టీవీలు, ప్రాజెక్టర్లు


### అందజేయనున్న కేంద్రం

న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యులకు కేంద్రం త్వరలోనే ఆధునిక గ్యాడ్జెట్లను ఉచితంగా అందజేయనుంది. తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా వారికి స్మార్ట్ టీవీలు, స్మార్ట్ ప్రొజెక్టర్లు, ఇతర వేరబుల్ గ్యాడ్జెట్లను అందజేస్తారు. రాజ్యసభ సభ్యుల పదవీ కాలం మూడేండ్లకు పైగా ఉంటే వారికి రూ.2 లక్షలు.. మూడేండ్లు, అంతకన్నా తక్కువ పదవీ కాలానికి ఉప ఎన్నిక ద్వారా ఎన్నికైన సభ్యులకు రూ.1.5 లక్షలు ఇస్తారు. మూడేండ్ల కన్నా అదనంగా పదవీ కాలం ఉన్న వారికి అదనంగా రూ.లక్ష కేటాయిస్తారు. ఇప్పటికే రాజ్యసభ సభ్యులు డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్, ప్రింటర్, స్కానర్, యూపీఎస్, స్మార్ట్‌ఫోన్ లాంటి సౌకర్యాలు పొందుతున్నారు.

# ఫుడ్ లేబుల్స్‌లో '100%' పదం వాడొద్దు

### ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశాలు

న్యూఢిల్లీ: మనం తరచూ ప్రకటనల్లో.. 'మా ప్రొడక్ట్ వంద శాతం సురక్షితమైనది.. వంద శాతం స్వచ్ఛమైనది.. వంద శాతం ఉపశమనం కలిగిస్తుందది..' లాంటి మాటలు వింటుంటాం. అయితే ఇక నుంచి 100 శాతం అన్న పదాన్ని వాడరాదని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏ) అడ్వైజరీ గురువారం జారీ చేసింది. ఫుడ్ లేబులింగ్‌లో 100% అనే పదాన్ని ఉపయోగించడం వల్ల వినియోగదారులను తప్పుదారి పట్టించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఈ ఆదేశాలు జారీ చేసింది. అన్ని రకాల ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ పదాన్ని ఉపయోగించరాదని కోరింది.



సుప్రీంకోర్టు జడ్జీలుగా జస్టిస్ అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ చందూర్కర్‌తో ప్రమాణం చేయిస్తున్న సీజేఐ గవాయ్

# సీబీఐకి చిక్కిన ఈడీ!

### 20 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన అధికారి

భువనేశ్వర్: ఓ వ్యాపారి నుంచి రూ. 20 లక్షలు లంచం తీసుకుంటూ సీబీఐకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడో ఈడీ అధికారి. ఒడిశాలోని డెంకనల్‌కు చెందిన స్టోన్ మైనింగ్ వ్యాపారి రతికాంత రౌత్‌పై ఈడీ కేసు నమోదైంది. ఈ కేసు నుంచి ఆయనను బయటపడేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చింతన్ రఘువంశీ రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అతడి నుంచి మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20 లక్షలు అందుకుంటుండగా ఈడీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం.. ఈడీ తనపై కేసు నమోదు చేసి ప్రశ్నించేందుకు పిలవడంతో రౌత్ వెళ్లగా కేసు నుంచి ఉపశమనం పొందాలంటే భగతి అనే వ్యక్తిని కలవాలని సూచించారు. ఈ కేసులో అరెస్ట్ కాకుండా ఉండాలంటే రఘువంశీకి రూ. 5 కోట్లు చెల్లించాలని భగతి డిమాండ్ చేశాడు. ఆ తర్వాత రఘువంశీతో మాట్లాడి రూ. 2 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ. 20 లక్షలు పుచ్చుకుంటుండగారెడ్ హ్యాండెడ్‌గా రఘువంశీని పట్టుకున్నారు.






# కిటికీ నుంచి నోట్ల వర్షం!

### విజిలెన్స్ అధికారుల రాకతో వెదజల్లిన ఇంజినీర్
### రూ. 2.1 కోట్లు స్వాధీనం చేసుకున్న అధికారులు

భువనేశ్వర్: ఒడిశాలోని ఓ ప్రభుత్వ ఇంజినీర్ ఫ్లాట్ కిటికి నుంచి నోట్ల వర్షం కురిసింది. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్టు సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు రూరల్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన చీఫ్ ఇంజినీర్ బైకుంఠనాథ్ సారంగి ఇంటిపై దాడిచేశారు. వారు వస్తున్న విషయం తెలుసుకున్న సారంగి అధికారులకు పట్టుబడకూడదన్న ఉద్దేశంతో భువనేశ్వర్‌లోని తన ఫ్లాట్ కిటికి నుంచి రూ.500 నోట బండిళ్లను బయటకు విసిరేశాడు. అలా విసిరేసిన నగదును ప్రత్యక్ష సాక్షుల సమక్షంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భువనేశ్వర్, అంగుల్, పిలిపి (పూరి) సహా ఏడు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు మొత్తం రూ. 2.1 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

### రిసెప్షనిస్టు హత్య కేసులో
# మాజీ బీజేపీ నేత కుమారుడికి యావజ్జీవం

డెహ్రాడూన్, మే 30: అంకితా భండారీ అనే 19 ఏళ్ల రిసెప్షనిస్టు హత్య కేసులో మాజీ బీజేపీ నాయకుడి కుమారుడు పుల్కిత్ ఆర్యతోపాటు మరో ఇద్దరు నిందితులకు ఉత్తరాఖండ్‌లోని సెషన్స్ కోర్టు శుక్రవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. పుల్కిత్ ఆర్యతోపాటు సౌరభ్ భాస్కర్, అంకిత్ గుప్తాలకు రూ. 50,000 చొప్పున కోట్‌ద్వార్‌లోని అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు జరిమానా విధించింది. ఉత్తరాఖండ్‌లోని పౌరీ జిల్లా యంకేశ్వర్ ప్రాంతంలోని పుల్కిత్ ఆర్యకు చెందిన వనంతార రిసార్ట్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న అంకిత్ గుప్తా 2022లో హత్యకు గురైంది. 2022 సెప్టెంబర్ 18న అంకిత కనిపించకుండా పోయింది. చిలా కాల్వలో ఆమె మృతదేహం లభించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మహిళల భద్రత, రాజకీయ పలుకుబడి, న్యాయస్థానాలలో జాప్యంపై చర్చకు దారితీసింది.

# వలసదారుల బహిష్కరణకు అమెరికా సుప్రీంకోర్టు అనుమతి

వాషింగ్టన్: దాదాపు 5 లక్షల మంది వలసదారుల తాత్కాలిక చట్టబద్ధ హోదాను రద్దు చేసేందుకు అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం ప్రభుత్వానికి అనుమతి ఇచ్చింది. దీంతో వెనెజులా, క్యూబా, హైతీ, నికరాగ్వా అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించేందుకు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్‌కు అవకాశం లభించింది. గతంలో జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్ దాదాపు 5,32,000 మంది వలసదారులకు టెంపరరీ లీగల్ స్టేటస్‌ను మంజూరు చేసింది. దీనిని ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసింది. వలసదారులు కోర్టులను ఆశ్రయించారు.

# వీసా స్లాట్స్ కోసం తరచూ చెక్ చేసుకోండి

వాషింగ్టన్ : విద్యార్థి వీసా దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలను డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం నిలిపేసిన నేపథ్యంలో అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ గురువారం శుభవార్త చెప్పారు. ప్రస్తుతం కొంత ఆలస్యం జరుగుతున్నప్పటికీ, త్వరలోనే ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆన్‌లైన్ స్లాట్స్ ఎప్పుడు ఓపెన్ అవుతాయో తరచూ చెక్ చేసుకోవాలని దరఖాస్తుదారులకు సూచించారు. ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ వీసా ప్రాసెస్‌లో అత్యున్నత స్థాయి ప్రమాణాలను పాటిస్తూ, దేశ భద్రత, ప్రజల రక్షణపైనే దృష్టి పెట్టిందని చెప్పారు. వీసాను పొందడం జన్మహక్కు కాదని పేర్కొన్నారు.

# దేశంలో మళ్లీ కొవిడ్ విజృంభణ

### 1,828 యాక్టివ్ కేసులు నమోదు ▪ ఇప్పటివరకు 15 మంది మృతి

న్యూఢిల్లీ, మే 30: దేశంలో కొవిడ్-19 కేసులు మళ్లీ విజృంభిస్తున్నాయి. శుక్రవారం నాటికి(మే 30) దేశంలో 1,828 యాక్టివ్ కేసులు నమోదుకాగా ఇప్పటి వరకు 15 మరణాలు చోటుచేసుకున్నాయి. వీటిలో ఆరు మహారాష్ట్రలోనే సంభవించాయి. వెంటనే స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించేందుకు శ్వాసకోశ వ్యాధులు, అంటు వ్యాధుల సర్వే ప్రారంభించింది. గుజరాత్‌లో గురువారం ఆరు కొత్త కొవిడ్ కేసులు నమోదయ్యాయి. వీరిలో ఓ 8 నెలల శిశువు కూడా ఉంది. ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆ చిన్నారికి వెంటిలేటర్‌పై చికిత్స అందుతోంది. కేరళలో ప్రస్తుతం 17 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో ఒమిక్రాన్ జేఎన్ వేరియంట్ ఎల్ఎఫ్7 కేసులు నమోదవుతున్నట్లు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. జనవరి నుంచి మహారాష్ట్రలో 9,500 కొవిడ్ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. ఒక్క గురువారం నాడే మహారాష్ట్రలో 79 కొత్త కేసులు బయటపడ్డాయి. ఈ ఏడాదిలో ముంబైలో మొత్తం 379 కేసులు నమోదయ్యాయి. జనవరి, ఫిబ్రవరిలో ఒక్కో కేసు, ఏప్రిల్‌లో 4 కేసులు నమోదు కాగా మేలో ఒక్కసారిగా 373 కేసులు నమోదయ్యాయి. జమ్ము కశ్మీరులో గురువారం రెండు కొత్త కేసులు నిర్ధారణ య్యాయి. కొవిడ్ బారిన పడిన వీరిద్దరూ కేరళకు చెందిన విద్యార్థులు.




# నైతిక ప్రవర్తన బాగుంటేనే..!

- పౌరసత్వంపై అమెరికా కొత్త మెలిక
- నేరచరిత్ర ఉన్నా, ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులు, ఇంటర్వ్యూల్లో నిజాయితీగా లేకున్నా నో సిటిజన్‌షిప్

న్యూఢిల్లీ, మే 30: అమెరికా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటున్నారా? అయితే, నైతిక ప్రవర్తన సరిగా లేనివారు 'న్యూట్రలైజేషన్'కు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అమెరికా పౌరసత్వ, శరణార్థి సేవల విభాగం (యూఎస్‌సీఐఎస్) స్పష్టం చేసింది. నైతిక ప్రవర్తన సరిగా లేని గ్రీన్‌కార్డు హోల్డర్లకు అమెరికా పౌరసత్వాన్ని మంజూరు చేసే అంశాన్ని పరిశీలించబోమని పేర్కొంటూ.. దరఖాస్తుదారులు ఉన్నత నైతిక, సామాజిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. గ్రాండ్ తెఫ్ట్ ఆటో అనే దొంగతనానికి సంబంధించిన యాక్టివ్ వారెంట్‌తో అమెరికాలోకి ప్రవేశించిన ఓ వలసదారుడి కేసును ప్రస్తావిస్తూ యూఎస్‌సీఐఎస్ ఈ హెచ్చరిక చేసింది. అమెరికా పౌరుడు కావడం గొప్ప హక్కని, అమెరికాను నిర్వచించే విలువలు, బాధ్యతలు, స్వేచ్ఛలను స్వీకరించే వారికే ఈ గౌరవం ఇవ్వబడుతుందని, అంతేతప్ప ఇది అందరికీ హామీ ఇవ్వబడిన హక్కు కాదని 'ఎక్స్' (ట్విట్టర్)లో యూఎస్‌సీఐఎస్ పేర్కొన్నది. అమెరికా పౌరసత్వ చట్టంలో 'మంచి నైతిక స్వభావం' అనేది దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సిన చట్టబద్ధమైన ప్రమాణమని, స్టాట్యుటరీ పీరియడ్ (సాధారణంగా పౌరసత్వ దరఖాస్తుకు ముందు ఐదేండ్లు)లో తమ ప్రవర్తన సమాజంలోని సగటు సభ్యుడు ఆశించే నైతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్టు దరఖాస్తుదారులు నిరూపించుకోవాల్సి ఉంటుందని 'బర్జియన్ లా' సీనియర్ పార్ట్‌నర్ కేతన్ ముఖీజా తెలిపారు.

**న్యూట్రలైజేషన్ అంటే..**

గ్రీన్‌కార్డు హోల్డర్ అమెరికా పౌరుడిగా మారే ప్రక్రియనే న్యూట్రలైజేషన్ అంటారు. ఇందుకు సాధారణంగా దరఖాస్తుదారుడి స్థితిగతులను బట్టి మూడు నుంచి ఐదేండ్ల సమయం పడుతుంది. దరఖాస్తుదారులు నివాస నిబంధనలను పాటించడం, మంచి నైతిక స్వభావాన్ని కలిగి ఉన్నట్టు నిరూపించుకోవడంతో పాటు ఇంగ్లిష్, పౌరశాస్త్ర పరీక్షల్లో ఉత్తీర్ణులు కావాలి. అమెరికా పట్ల విధేయతను ప్రకటిస్తూ ప్రమాణం చేయాలి.




**నైతిక ప్రవర్తన విషయంలో పరిశీలించే అంశాలు ఇవీ..**

- దరఖాస్తుదారుల అరెస్టులు, నేరచరిత్ర, వారిపై ఉన్న నేరారోపణలు.
- పన్ను చట్టాలను పాటిస్తున్నారా? లేదా? ఆర్థిక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారా? లేదా?
- ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులు, ఇంటర్వ్యూల్లో నిజాయితీ.
- సామాజిక ప్రవర్తన.



# అమెరికాలో చైనా అధ్యక్షుడి కుమార్తె?

న్యూయార్క్: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూతురు మింగ్జి అమెరికాలో రహస్య జీవితం గడుపుతున్నట్టు తెలుస్తున్నది. హార్వర్డ్ వర్సిటీలో చదువుకుంటూ కట్టుదిట్టమైన భద్రత మధ్య రహస్యంగా నివసిస్తున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. భద్రతా కారణాల రీత్యా చైనా విద్యార్థుల వీసాలను రద్దు చేయనున్నట్టు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబినో ప్రకటించిన నేపథ్యంలో జిన్‌పింగ్ కూతురు నివాసం గురించి చర్చ మొదలైంది.